క్లుప్తంగా

బైకును ఢీకొట్టిన వాహనం

ఒకరు మృతి, మరొకరికి గాయాలు


గౌసుద్దీన్ (ఫైల్)

మొయినాబాద్: గుర్తు తెలియని వాహనం బైకును ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మొయినాబాద్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్‌కు చెందిన మహ్మద్ గౌసుద్దీన్(46), అతని స్నేహితుడు అబ్దుల్ రహీంతో చేవెళ్ల నుంచి మొయినాబాద్‌కు వస్తున్నారు. హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై మొయినాబాద్ సమీపంలోని కిరణ్ వే బ్రిడ్జ్ వద్దకు చేరుకోగానే గుర్తుతెలియని వాహనం బైకును ఢీకొట్టింది. ఈ ఘటనలో మహ్మద్ గౌసుద్దీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్నేహితుడు అబ్దుల్ రహీంకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అబ్దుల్ రహీంను చికిత్సకోసం ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యారాణికి డాక్టరేట్ ప్రదానం


విద్యారాణి

షాద్‌నగర్: షాద్‌నగర్ పట్టణానికి చెందిన అధ్యాపకురాలు విద్యారాణికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేశారు. పట్టణానికి చెందిన ఆమె కొంత కాలంగా మహబూబ్‌నగర్ జిల్లా పాలెంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఫిజిక్స్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ కరుణసాగర్ పర్యవేక్షణలో 'స్టడీస్ ఆన్ ద పర్‌ఫార్మెన్స్ ఆఫ్ ఆపరేటెడ్ ఆప్టికల్ ఇమేజింగ్ సిస్టమ్స్ విత్ వేరియబుల్ అపోడైజేషన్' అనే అంశంపై పరిశోధన పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం వారు విద్యారాణికి డాక్టరేట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనునిత్యం తల్లిదండ్రులు శ్యామల, వెంకటన్న, భర్త ప్రవీణ్‌బాబు, ప్రొఫెసర్ కరుణసాగర్‌లు తనను ఎంతో ప్రోత్సహించారన్నారు. వారి ప్రోత్సాహంతోనే తాను ఈ స్థాయికి చేరుకోగలిగానన్నారు.

చిన్నారులకు స్టీల్ బాటిల్స్ అందజేత

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని దేవేందర్‌నగర్ కాలనీలో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతహీ సేవ పథకం కింద అంగన్‌వాడీ చిన్నారులకు వాటర్ బాటిల్స్‌ను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా డీజీ ఎంఎస్ఎస్ సైంటిస్ట్ రాజాబాబు మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్య సంరక్షణ కోసం బాటిల్స్‌ను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ యాదగిరిరెడ్డి, అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.


కొండకల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య


మొయినాబాద్: సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నారై నేతలు

బీఆర్ఎస్ విజయం ఖాయం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- సంక్షేమ పథకాలు పార్టీకి రక్ష
- ఎన్ని జిమ్మిక్కులు చేసినా గెలుపును ఆపలేరు
- జోరుగా ఇంటింటి ప్రచారంలో నాయకులు


మొయినాబాద్‌రూరల్: నదీమ్‌నగర్ ప్రచారంలో మహేశ్

చేవెళ్ల: కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మొద్దని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. శనివారం బీఆర్ఎస్ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాతనే మన గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని, అందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: బీఆర్ఎస్ విజయం ఖాయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే పార్టీకి రక్ష అని చెప్పారు. శనివారం కొండకల్, కొండకల్‌తండాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేపట్టని అభివృద్ధి, సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారన్నారు. రైతుల సంక్షేమం కోసం రైతు బంధు, రైతు బీమా పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా కళ్యాణ లక్ష్మీ, శాదీముబారక్ పథకాల ద్వారా పేదింటి యువతుల వివాహాలకు రూ. 1,00,116 అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. మూడోసారి అధికారంలోకి వస్తే పింఛన్ డబ్బులను రూ. 5,016కు పెంచనున్నట్లు చెప్పారు. వికలాంగులకు రూ. 6,016, రూ.400కే గ్యాస్ సిలిండర్‌ను అందించనున్నట్లు పేర్కొన్నారు. శంకర్‌పల్లి ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, కొండకల్ ఎంపీటీసీ బద్దం సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాపారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు వెంకట్‌రెడ్డి, రాజునాయక్, గోపాల్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌రూరల్‌లో..

మొయినాబాద్‌రూరల్: బీఆర్ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరని మొయినాబాద్ మండల యువజన నాయకులు మహేశ్‌యాదవ్ అన్నారు. నదీమ్‌నగర్, కాశింబౌలి ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఎమ్మెల్యే కాలె యాదయ్య మూడోసారి గెలవడం ఖాయమన్నారు.

భూకబ్జాలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా

మొయినాబాద్: భూకబ్జాలు చేసినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని చేవెళ్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య పేర్కొన్నారు. అప్పోజీగూడ, చిలుకూరు తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉండి ఎక్కడా భూ దందాలు, సెటిల్‌మెంట్లు, చేయలేదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్ భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు, ఆయుధాల సరఫరా చేశారని ఆరోపించారు. బీజేపీ అభ్యర్థి రత్నం మొన్నటి వరకు బీఆర్ఎస్‌లో ఉన్న నేత అని గుర్తు చేశారు. ఇప్పుడు అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు తనపై చేస్తున్న ఆరోపణలను నమ్మొద్దన్నారు. నా జీవితం తెల్లకాగితమని, ఎక్కడా ఎలాంటి మచ్చలేకుండా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశానన్నారు. కొంపల్లి అనంతరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్న, ఎంపీపీ నక్షత్రం, సర్పంచ్ స్వరూప, ఎంపీటీసీలు శ్రీనివాస్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి బీఆర్ఎస్‌దే : ఎన్ఆర్ఐ ఇన్‌చార్జి రమేశ్ దేవా

తెలంగాణలో మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆ పార్టీ ఎన్ఆర్ఐ ఇన్‌చార్జి రమేశ్ దేవా అన్నారు. చిలుకూరులో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కాలె యాదయ్యకు ఎన్ఆర్ఐలు మద్దతు తెలిపారు. ఆయనతో కలిసి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి కాలె యాదయ్యను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సౌత్‌ఆఫ్రికా జనరల్ సెక్రెటరీ నరేందర్ రెడ్డి, యూఎస్ఏ నేత కత్తి గోపాలకృష్ణ, సౌత్‌ఆఫ్రికా నేత లక్ష్మణ్ వెన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరులో నిరసన సెగ..

మొయినాబాద్: చిలుకూరు–మొయినాబాద్ రోడ్డు ఎందుకు పూర్తి చేయలేదని కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను ప్రశ్నించారు. మండల పరిధిలోని చిలుకూరులో శనివారం ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే కాలె యాదయ్యను గ్రామంలోకి రావద్దంటూ కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. చిలుకూరు–మొయినాబాద్ బీటీ రోడ్డు పూర్తి చేసి గ్రామంలోకి రావాలన్నారు. రోడ్డు పూర్తి చేయించకుండా ఎందుకొస్తున్నావంటూ ఎమ్మెల్యేను అడ్డుకున్నారు. ఎమ్మెల్యే యాదయ్య ప్రచార రథానికి కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు అడ్డుగా వెళ్లే ప్రయత్నం చేయడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు, పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య తోపులాట జరిగింది. పోలీసులు కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలను అక్కడి నుంచి పంపించడంతో ఎమ్మెల్యే యాదయ్య గ్రామంలో ప్రచారం నిర్వహించారు.

దొరల పాలనకు స్వస్తి

- మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్


చేవెళ్ల: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్

చేవెళ్ల: రాష్ట్రంలో దొరల పాలనకు స్వస్తి పలకాలని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం పార్టీ అభ్యర్థి పామెన భీంభరత్, నియోజకవర్గ సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి, ప్రచార కమిటీ సభ్యుడు సున్నపు వసంతంలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో గడీలపాలన చేస్తున్న కేసీఆర్‌ను గద్దె దించి ప్రజా దర్బార్ నిర్వహించిన వైఎస్ఆర్ లాంటి వ్యక్తిని గెలిపించుకోవాలన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ, రాష్ట్రంలో కేడీ కేసీఆర్‌లే ధరల పెరుగుదలకు కారణమన్నారు. అలాంటి వారిని ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో నమ్మరన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామన్నారు. కాంగ్రెస్‌ని గెలిపిస్తే వ్యవసాయానికి సాయం, ఉద్యోగ నోటిఫికేషన్లు ఉంటాయన్నారు. చేవెళ్లలో కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్‌ను గెలిపించుకోవాలన్నారు. డీవీఆర్, ఆగిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ప్రభాకర్, శ్రీనివాస్, క్రిష్ణగౌడ్, మల్లేశ్, శ్రీనివాస్‌గౌడ్, రాములు, జంగారెడ్డి పాల్గొన్నారు.

మాయమాటలు నమ్మొద్దు

- జబర్దస్త్ ఫేం కొమురక్క


ప్రచారంలో మాట్లాడుతున్న కొమురక్క

షాద్‌నగర్‌రూరల్: ఎన్నికల సమయంలో నేతలు చెప్పే మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని జబర్దస్త్ ఫేం కొమురక్క అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డికి మద్దతుగా శనివారం ఫరూఖ్‌నగర్ మండలపరిధిలోని కడియాలకుంట తండా, బూర్గుగడ్డ తండా గ్రామ పంచాయితీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురక్క మాట్లాడుతూ ఓట్ల కోసం మాయమాటలు చెప్పి డబ్బులు, మద్యంతో ప్రజల ముందుకు వస్తున్న నేతలను నమ్మొద్దన్నారు. ప్రలోభాలకు లొంగొదని చెప్పారు. ప్రజల కష్ట సుఖాలు తెలిసిన నేత విష్ణువర్ధన్‌రెడ్డి అని అన్నారు. తండాల్లో నీటి సమస్యను గుర్తించి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆయన ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఆయనను గెలిపించాలని కొమురక్క ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మోహన్‌సింగ్, మల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజు నాయక్, ప్రతాప్‌రెడ్డి, కుమార్, మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌లతో మేధస్సు పెరుగుతుంది

- ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి రాజు చంద్రశేఖర్


మొయినాబాద్ రూరల్: సదస్సులో పాల్గొన్న మంత్రి రాజు చంద్రశేఖర్

మొయినాబాద్ రూరల్: నేషనల్ రోడ్ షో హాడ్స్ ఆఫ్ వర్క్ షాప్ అనే అంశంపై అవగాహన సదస్సును కేఎల్ యూనివర్సిటీ కళాశాలలో రెండు రోజులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి రాజు చంద్రశేఖర్ హాజరై మాట్లాడారు. కేఎల్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌లో విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. విద్యతో పాటు వివిధ కళాశాలల్లో నిర్వహిస్తున్న కాన్ఫరెన్స్‌లు, విద్యార్థులకు అవగాహన కల్పించడమే కాకుండా వారిలో మేధస్సును పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అవినీతి పాలనను ఓడించండి

- జాగో తెలంగాణ రాష్ట్ర కన్వీనర్, విశ్రాంత ఐఏఎస్ ఆకునూరి మురళీ


మొయినాబాద్: బస్సు యాత్రలో మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ ఆకునూరి మురళీ

మొయినాబాద్: అవినీతి, నియంతృత్వ పాలన సాగిస్తున్న కేంద్రంలో మోదీ సర్కార్, రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని ఓడించాలని జాగో తెలంగాణ రాష్ట్ర కన్వీనర్, విశ్రాంత ఐఏఎస్ ఆకునూరి మురళీ పేర్కొన్నారు. శనివారం తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామ్య వేదిక, జాగో తెలంగాణ ఆధ్వర్యంలో చేపడుతున్న ఓటరు చైతన్య బస్సు యాత్రలో ఆయన మాట్లాడారు. నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలను వేల కోట్ల కుంభకోణాలతో కేసీఆర్ కుటుంబం తన్నుకుపోయారన్నారు. రాష్ట్రంలో విద్యా వైద్యం నాషనమయ్యాయన్నారు. నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. నిరు పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, కార్మికులకు కనీస వేతనాల దిక్కులేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధుతో రైతులు కానివారి జేబులు నింపుతున్నారని మండిపడ్డారు. దేశంలో మోదీ ప్రభుత్వం విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తెచ్చి ప్రతీ కుటుంబానికి రూ.15 లక్షలు ఇస్తామన్నా మాట ఏమైందని ప్రశ్నించారు. బడా, కార్పొరేట్ కంపెనీలకు రూ.16లక్షల కోట్లు రుణ మాఫీ చేసిందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రజలు మేలుకొని ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న మోదీ, కేసీఆర్‌లను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు.


ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

ఓటర్ స్లిప్పుల పంపిణీ

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని ఓటర్లకు పోలింగ్ స్లిప్పులను అధికారులు శనివారం పంపిణీ చేస్తున్నారు. మున్సిపాలిటీలో 15 వార్డులకు గాను 21,656 మంది ఓటర్లు ఉన్నారు. వీరందరూ ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా, పోలింగ్ కేంద్రాల వద్ద ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ తెలిపారు.

ప్రధానికి ఘన స్వాగతం


ప్రధానికి స్వాగతం పలుకుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం తుక్కుగూడలో నిర్వహించిన బహిరంగ సభకు షాద్‌నగర్ నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలికారు. అనంతరం తన కూతురు సాత్విక రాసిన లేఖను ప్రధానికి ఆయన అందజేశారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

- కాంగ్రెస్ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్
- రాష్ట్రాన్ని లూటీ చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- తప్పుడు కథనాల సృష్టికర్త ఎమ్మెల్యే కాలె యాదయ్య
- ఓటమి భయంతోనే కుట్రకు యత్నం
- భీంభరత్ విజయాన్ని ఎవరూ ఆపలేరు
- పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి


మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య ఫొటోను విడుదల చేసిన కాంగ్రెస్ నాయకులు

షాబాద్: ఓటమి భయంతోనే భీంభరత్‌పై తప్పుడు కథనాలను సృష్టిస్తున్నారని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. రాంరెడ్డి, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన భార్గవ్‌రామ్‌లతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజు రోజుకు నియోజకవర్గంలో కాంగ్రెస్‌కి పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఎమ్మెల్యే యాదయ్య తన అనుచరులతో కలిసి కుట్రలకు యత్నం చేస్తున్నారన్నారు. భీంభరత్‌కు వ్యతిరేకంగా వాల్ పోస్టర్లు అంటించిన వారిపై సీఐ యాదయ్యగౌడ్ నామమాత్రంగా బైండోవర్ చేసి చేతులు దులుపుకున్నారన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో భీంభరత్ టఫ్ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన కళా బృందాలచే ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తనవంతు కృషి చేశారన్నారు. సోషల్ మీడియాలో భీంభరత్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్న ఏడుగురిపై ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తామన్నారు. నియోజకవర్గంలో మచ్చలేని నాయకుడిగా మంచి పేరు ఉన్న నాయకుడు భీంభరతేనన్నారు. పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ఎళ్లవేళల ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, మల్లేశ్, మాజీ సర్పంచ్‌లు యాదగిరి, సత్యనారాయణ, రవీందర్‌నాయక్, బుచ్చయ్య, చెన్నయ్య, పెంటయ్య, సత్తయ్య, యాదయ్య పాల్గొన్నారు.


షాబాద్: ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న పామెన భీంభరత్

షాబాద్ మండలంలో ఇంటింటి ప్రచారం..

షాబాద్: తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం లూటీ చేసి, భ్రష్టు పటించారని ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్ పేర్కొన్నారు. శనివారం రాత్రి నాగర్‌కుంట, ముద్దెంగూడ, గోపిగడ్డ, సంకెపల్లిగూడ గ్రామాల్లో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శులు పీసరి సురేందర్‌రెడ్డి, ఎస్. రాంరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోనియాగాంధీ ఇచ్చిన తెలంగాణను కేసీఆర్ ప్రభుత్వం ఇష్టాను సారంగా దోపిడీకి పాల్పడిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో వేలకోట్ల రూపాయలు లూటీ చేశారన్నారు. ఈ ఎన్నికల్లో కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు జనం సిద్ధంగా ఉన్నారన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్ర తెలంగాణలో కాంగ్రెస్ బలోపేతానికి ఎంతో దోహదపడిందన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, మల్లేశ్, జయమ్మ వెంకట్‌రెడ్డి, పీసీసీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అశ్వక్ అలీ, అక్తర్‌పాషా, రషీద్‌పటేల్, తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్ సతీమణి జ్యోతి అన్నారు. శనివారం మండలంలోని దొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పేదల పక్షానా పోరాడే పార్టీ అని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే పేదలకు మేలు జరుగుతుందన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, భీమేశ్, బద్రి శ్రీకాంత్, శివ, షారు, మోయిన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఫరూఖ్‌నగర్‌కు చెందిన మహ్మద్ యూసుపొద్దీన్‌తోపాటు అతని అనుచరులు భారీ ఎత్తున ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సమక్షంలో పార్టీలో చేరారు. పట్టణంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం కేసీఆర్ అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను చేపట్టారన్నారు. అభివృద్ధిలో రాష్ట్రం నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. పట్టణానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు దంగు వెంకటేశ్ యాదవ్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. మురళీ యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మహ్మద్ బారీద్, బహదూర్ అలీ, మహ్మద్ జలీల అహ్మద్ హుస్సేన్, మహమూద్, జాఫర్, హాజీ, రషీద్, ఖలీల్, జహంగీర్, మహ్మద్‌గౌస్, మజర్ తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్, అద్దు, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు: షాద్‌నగర్ ఎమ్మెల్యేగా అంజయ్యయాదవ్‌ను మరోసారి గెలిపించుకుంటేనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని బీఆర్ఎస్ నాయకులు చెన్నయ్య అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరన్నపేటలో ఇంటింటి ప్రచారం చేశారు. మాజీ ఎంపీటీసీ రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: రాష్ట్రంలో 60 ఏళ్లుగా కాంగ్రెస్ చేయని అభివృద్ధి బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం తొమ్మిదేళ్లలోనే చేసిందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన ఉప్పల్ ఎమ్మెల్యే నేతి సుభాష్‌రెడ్డితో కలిసి కొత్తూరు మున్సిపాలిటీలోని కుమ్మరిగూడ, ఫాతీమాపూర్, తిమ్మాపూర్, చౌరస్తాకాలనీతో పాటు పట్టణంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ని నమ్మితే ఆగమైతరన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులే తిరిగి పార్టీని అధిక మెజార్టీతో గెలిపిస్తాయన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, వైస్ చైర్మన్ రవీందర్, నారాయణరెడ్డి, మాజీ జెడ్పీవైస్ చైర్మన్ నవీన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మె సత్యనారాయణ పాల్గొన్నారు.


కొత్తూరు: తిమ్మాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్


వీరన్నపేటలో ఇంటింటి ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు